అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. గురువారం నాచారం రాఘవేంద్రనగర్‌లో రూ.35 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ లైన్లు వేసిన తర్వాతే సీసీరోడ్లు వేస్తున్నామని తెలిపారు. ఏఈ వినీత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు విఠల్‌యాదవ్, ప్రభావతి, కట్ట బుచ్చన్నగౌడ్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధిపై సమీక్ష

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని పార్కుల అభివృద్ధిపై జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యూబీడీ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ఉన్న పార్కుల స్థితిగతులను వారికి వివరించి చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చించారు. భవిష్యత్తులో డివిజన్ వ్యాప్తంగా ఉన్న పార్కులను అభివృద్ధి చేసి పార్కుల్లో పచ్చదనం పెంచేలా చేస్తానన్నారు. యూబీడీ సూపర్‌వైజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ స్లాబ్ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. గురువారం పలు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదుల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రశాంతి నేతృత్వంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. 13, 1, 20వ డివిజన్లలో అనుమతులకు మించి అదనంగా నిర్మిస్తున్న నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పలు నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

సమష్టి భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం

కుషాయిగూడ: సమష్టి భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజారోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణకు గురువారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో చేపట్టిన శానిటేషన్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్, తిరుమలనగర్, కృష్ణానగర్, లక్ష్మీనగర్, ఇందిరానగర్ కాలనీల్లో వీధులను శుభ్రం చేశారు. చెత్తా,చెదారం ఎత్తివేయడంతో పాటుగా గ్రీన్‌వేస్ట్‌ను తొలగించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇళ్లు, వ్యాపార సముదాయాల చెత్తను ఇష్టానుసారంగా పారవేయకుండా జీహెచ్‌ఎంసీ శానిటేషన్ కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ మధుసూదన్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఉప్పల్ వేంకటేశ్వర ఆలయం కమాన్ నుంచి గాంధీనగర్, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజారోగ్యం ముఖ్యమని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. ఖాళీస్థలాల్లో చెత్త వేయొద్దని, ఇంట్లోని చెత్తను రిక్షావారికే అందజేయాలని సూచించారు. ఉప్పల్ సర్కిల్ పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

పార్క్ చేసిన కారులో సెల్‌ఫోన్ల చోరీ

డ్రైవర్ నిద్రకు ఉపక్రమించడంతో దుండగుల చేతివాటం

కుషాయిగూడ: పార్క్ చేసిన కారులోంచి సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఓయూ డీడీ కాలనీకి చెందిన నరకంటి వెంకటరమణ వృత్తిరీత్యా డ్రైవరు. కాగా ఈనెల 17న తన కారులో ప్యాసింజర్స్‌ను కుషాయిగూడ, పద్మశాలి కాలనీలో దించేసి రాత్రి 12 గంటలకు తిరిగి వెళ్లే క్రమంలో రాధిక చౌరస్తా సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో కారును పార్క్ చేసి కారులోనే పడుకున్నాడు. మరుసటి రోజు ఉదయం నిద్రలేచి చూడగా.. కారు విండో తెరిచి ఉంది. కారులో ఉన్న 2 సెల్‌ఫోన్లు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడుంటారో.. ఏం చేస్తున్నారో !

5 నెలలుగా రిజిస్టర్‌లో సంతకాలు చేయని డీజీఎం, మేనేజర్లు

- కనెక్షన్ కావాలంటే కాళ్లు అరగాల్సిన పరిస్థితి
- సెక్షన్ ఆఫీస్ వద్ద కాలనీవాసుల నిరసన


సెక్షన్ కార్యాలయం వద్ద స్థానికుల నిరసన

మల్కాజిగిరి: సైనిక్‌పురి డివిజన్‌లోని చాణుక్యపురి సెక్షన్ అధికారులు, సిబ్బంది తీరుతో ప్రజలే కాదు. ప్రజా ప్రతినిధులు కూడా బేజారెత్తుతున్నారు. సమస్యలు చెబుతామంటే కార్యాలయానికి వెళ్తే.. అందుబాటులో ఉండరని, ఫీల్డ్‌లో కనబడరని కాలనీ సంక్షేమ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వసంతపురి కాలనీ, బీజేఆర్‌నగర్, పీవీఎస్ కాలనీకి చెందిన ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. గురువారం చాణుక్యపురిలోని సెక్షన్ కార్యాలయానికి కార్పొరేటర్ తరలివెళ్లారు.

కనిపించని అధికారులు..

సెక్షన్ కార్యాలయానికి వెళ్లిన సమయంలో కొంత మంది సిబ్బంది తప్పా.. డీజీఎం, మేనేజర్ అధికారులు ఎవ్వరూ కనిపించలేదు. సిబ్బందిని ఆరా తీస్తే ఫీల్డ్‌లో ఉన్నారని చెప్పారు. ఎక్కడా.. వాళ్లు లేరన్న విషయం కార్పొరేటర్ తెలుసుకున్నారు. కార్యాలయంలో ఉన్న బయోమెట్రిక్ మిషన్ పనిచేయడం లేదు. అటెండెన్స్ రిజిష్టర్‌ను కార్పొరేటర్ తనిఖీ చేయగా.. అసలు విషయం బయటపడింది. సుమారుగా 5 నెలల నుంచి డీజీఎం, మేనేజర్లు సంతకాలు కూడా చేయలేదు. అయినప్పటికీ జీం స్థాయిలో వేతనాలు మంజూరవుతున్నాయి.


హాజరు రిజిస్టర్ తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

కలుషితనీరు వస్తున్నా స్పందన కరువు..

కలుషితనీరు సరఫరా అవుతున్నా అధికారులెవరూ.. పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వాటర్ లైన్‌మెన్స్ దృష్టికి తీసుకొచ్చినా.. తాగునీళ్లు అలాగే వస్తాయని సమాధానం చెబుతూ.. దాటవేస్తున్నారని, అధికారులకు చెబుతామంటే అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

చాణుక్యపురి సెక్షన్ అధికారుల తీరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కనెక్షన్, రెండో కనెక్షన్, పేరు మార్పుకోసం వచ్చే వారిని అన్ని పత్రాలు ఉన్నప్పటికీ (జలమండలి నిబంధనల ప్రకారం) సంబంధిత సెక్షన్ డీజీఎం స్థాయి అధికారులు తిప్పుతూ.. ఉంటారని స్థానికులు చెబుతున్నారు.

ఉద్యోగి తరఫున వస్తే అన్నీ ఓకే..

సాయినాథపురం సెక్షన్ కార్యాలయంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి తరుపున వచ్చిన ఫైల్స్‌కు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా అనుమతులు మంజూరు చేస్తారని, చాణుక్యపురి, గౌతంనగర్ సెక్షన్ల నుంచి వచ్చే దరఖాస్తులకు షాట్‌ఫాల్ పేరున తిప్పుతూ.. ఉంటారన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన విచారణ చేసి చాణుక్యపురి సెక్షన్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధులంటే గౌరవం లేదు



ప్రజా సమస్యలపై అధికారులు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. క్షేత్ర స్థాయితో పాటు కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉండటం లేదు. ప్రజాప్రతినిధులంటే కూడా గౌరవం ఇవ్వడం లేదు. అధికారుల తీరుపై జలమండలి ఎండీకి ఫిర్యాదు చేస్తాం.

– ప్రేమ్‌కుమార్, కార్పొరేటర్

కలుషిత నీటి సరఫరాతో ఇబ్బంది



గత కొద్ది రోజులుగా కలుషిత నీరు వస్తుంది. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా లైన్‌మెన్ పట్టించుకోవడం లేదు. అధికారులకు చెబుతామంటే వారు అందుబాటులో ఉండటం లేదు. ఇప్పటికే సరిపడ నీరు రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కలుషితనీటితో వచ్చిన నీరు కూడా వృథా అవుతోంది.

– కృష్ణవేణి, వేంకటేశ్వరనగర్

చదువు‘కొనడం’ కష్టం !

- ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల పెంపు
- మధ్యతరగతి తల్లిదండ్రులకు పెనుభారంగా..
- ఇబ్బందిపడుతున్న పలు కుటుంబాలు
- పేదలకు 50 శాతం తగ్గించాలని ఎమ్మెల్యే సూచన


స్కూల్ యాజమాన్యంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేయడంతో మధ్యతరగతి తల్లిదండ్రులకు పెనుభారంగా మారింది. ఈసీఐఎల్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన ప్రతినిధి ఫీజుల పెంపును ప్రశ్నిస్తే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం ప్రైవేటు విద్యాసంస్థల బాటపట్టారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ప్రైవేటు స్కూళ్లలో చదువుకోవాలంటే చాలా కష్టతరంగా మారిందని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ ఫీజులో 50 శాతం కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు.

◆ ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఫీజులో తప్పనిసరిగా 50 శాతం రాయితీ కల్పించాలని యాజమాన్యాలకు సూచించారు. నియోజకవర్గంలో ఎక్కువ శాతం కార్మికులు, పేద, మధ్యతరగతికి చెందిన కుటుంబాలే ఉంటాయని, రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు, నెలజీతంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే ప్రజలు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని ఎంత కష్టమైనా ఎన్నో ఆశలతో ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయిస్తున్నారన్నారు. వారి ఆర్థికపరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తప్పనిసరిగా 50 శాతం రాయితీ కల్పించాలన్నారు. కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సాయిజెన్‌శేఖర్, నవీన్‌గౌడ్, మహేష్‌గౌడ్, వంజరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు అధిక ప్రాధాన్యం


కంపోస్టు ఫిట్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, టీచర్లు

బోడుప్పల్: పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. గురువారం బోడుప్పల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులతో కంపోస్టు ఫిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్కూల్‌లో చెట్ల నుంచి రాలిన ఆకులను ఊడ్చి వాటి ద్వారా ఎరువును తయారు చేసే ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు. వీటి ద్వారా వచ్చే ఎరువును మొక్కలకు వేయనున్నట్లు పేర్కొన్నారు. కాలనీవాసులు కూడా ఈ ప్రక్రియను చేపట్టి ఎరువును తయారు చేసుకోవచ్చని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వినోద్, వార్డు ఆఫీసర్లు శివ, అరుణ్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన


స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛత పోటీలు నిర్వహించారు. గురువారం స్వచ్ఛ్ పీర్జాదిగూడపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్వచ్ఛ్ పీర్జాదిగూడకు మేము సైతమని, విద్యార్థులు ముందుకురావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా తడి, పొడిచెత్తను వేరుచేసే విధానం, వీధి కుక్కల నియంత్రణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు పాఠశాలల్లో స్వచ్ఛతపై డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా చిత్రాలు గీయడం, అనంతరం విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, బాలమురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మౌలాలి: డివిజన్ పరిధిలోని చిన్నగుట్ట పరిసర ప్రాంతాల్లో మొహరం పండుగను పురస్కరించుకుని మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు అమీనుద్దీన్, ఉస్మాన్, రాజశేఖర్‌రెడ్డి, దినేష్, మారుతీప్రసాద్, ఆషుర్‌ఖానా నిర్వాహకులు రాజాబాయ్, సాజిద్‌హుస్సేన్, సాబర్, సయ్యద్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతాల్లోని 15 ఆషూర్‌ఖానాల్లో మొహరం ఉత్సవాలు జరుగుతాయని, ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ పటిష్టం, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు.

ప్రభుత్వ స్కూల్‌లో మౌలిక వసతులు కల్పించాలి..

అల్వాల్: అల్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, అదనపు తరగతి గదులు, టీచర్ల కొరత, మౌలిక వసతులు కల్పించాలని ప్రధానోపాధ్యాయులు రమాదేవి ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయులు వెంకటయ్య, ఉపాధ్యాయురాలు సబిత, సంగీత, అల్వాల్‌వాసులు సురేందర్‌రెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

స్పందించిన జలమండలి అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ‘తాగునీటి కటకట’ శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురించిన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. కాలనీని సందర్శించి కెమెరాలతో సమస్యను పరిశీలించారు. ఓ ఇంటి డ్రైనేజీ పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమైనట్లు గుర్తించారు. రెండు పైపులైన్లు పక్కపక్కనే ఉండటంతో సమస్య తలెత్తినట్లు పేర్కొన్నారు. 2–3 రోజుల్లో సమస్యను పరిష్కరించి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నేటి నుంచి ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబిత

అల్వాల్: వెంకటాపురం డివిజన్ సాయిదత్త కాలనీలో రూ.9 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీవాసులు ఖైరున్, శ్రీనివాస్, బాగారెడ్డి, ఇబ్రహీం, మోహన్‌రావు, సుధాకర్, ఏఈ అరుణ్, వెంకట్రావు, నాయకులు అనిల్‌కిషోర్, శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, సయ్యద్ మోసిన్, శంకర్, ఆశారాణి, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మర్యాదపూర్వక కలయిక

అల్వాల్: వైఎస్ఆర్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు తడక జగదీశ్వర్‌గుప్తా గురువారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మాను చౌదరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గౌతంనగర్: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోనగిరి సురేష్‌యాదవ్ గురువారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మాను చౌదరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పుణ్య క్షేత్రమైన రామలింగేశ్వరస్వామివారిని దర్శించాలని కోరారు.


కలెక్టర్‌తో బోనగిరి సురేష్‌యాదవ్

కలెక్టర్‌తో స్థానిక కాంగ్రెస్ నేతలు..

ఉప్పల్: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మిక్కిలినేని మను చౌదరిని ఉప్పల్, మేడ్చల్ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, తోటకూర జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ఆర్‌సీపీ నేత జగదీశ్వర్‌గుప్తా

మినీ ట్యాంక్‌బండ్‌ను సుందరీకరిస్తాం

మల్కాజిగిరి: సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్‌ను సుందరీకరిస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. గురువారం ట్యాంక్‌బండ్ వద్ద చేపట్టిన ప్రధానద్వారం, పేయింటింగ్ పనులను ఆయన ఇంజినీరింగ్,ఎంటమాలజీ విభాగం అధికారులతో పరిశీలించారు. వినాయక నిమజ్జనం ప్రారంభమయ్యేలోగా ఆర్చి పనులు పూర్తవుతాయన్నారు. పిల్లల పార్క్ , బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గుర్రపుడెక్క పనులు వేగవంతం చేయాలని, ఎంటమాలజీ విభాగానికి సూచించామన్నారు. ఇటీవల కొందరు మినీట్యాంక్‌పై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని, విగ్రహాలు పెట్టడం వల్ల వాకింగ్ ప్రదేశం ఇరుకుగా మారుతుందని వాకర్స్, యోగా, లాఫింగ్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారని అధికారులను తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించామన్నారు. ఈఈ లక్ష్మణ్, డీఈ మహేష్, ఏఈ నవీన్, వీఐ రమేష్, ఎంటమాలజీ ఏఈ వనజ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం ఇండోర్ కాకతీయ కర్షక్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కార్తికేయ ఫీడర్, విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కొండిన్యనగర్, వీరారెడ్డినగర్, నాచారం మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

- 11 కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు వైజయంతి థియేటర్ మెయిన్‌రోడ్డు, రవీంద్రనగర్, వీరారెడ్డినగర్, అంబేడ్కర్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. 11 కేవీ రాంరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దుర్గానగర్, బాబానగర్, నాచారం విలేజ్, ఎర్రకుంట, కమాలాబాయినగర్, హనుమాన్‌నగర్, రాంరెడ్డినగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్‌నగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారలు సహకరించాలని కోరారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఆర్‌పీ నిలయం సబ్‌స్టేషన్ 11కేవీ వైష్ణవిమాత టెంపుల్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, అదేవిధంగా 11కేవీ వెంకటాపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మల్కాజిగిరి: వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ డైట్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ దేవీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కృపా కాంప్లెక్స్, శ్రీకృష్ణానగర్, సీతారాంనగర్, సైనిక్‌నగర్, రాంబ్రహ్మనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్‌క్రిస్టినా తెలిపారు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో...

11కేవీ శివపురి కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని, 11కేవీ బాలసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

రామంతాపూర్ : విద్యుత్ సబ్‌స్టేషన్ చర్చి కాలనీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, శ్రీనగర్‌కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సబ్‌స్టేషన్ ఏఈ లావణ్య కోరారు.

కాప్రా: విద్యుత్ మరమ్మతుల కారణంగా సైనిక్‌పురి సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు నేడు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సత్యనారాయణ తెలిపారు. హైటెన్షన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు వివరించారు. శాలివాహన ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ ఉండదని, ప్రజలు సహరించాలని ఏఈ సత్యనారాయణ పేర్కొన్నారు.

మేడిపల్లి: 11కేవీ పీర్జాదిగూడ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా 33/11 పీర్జాదిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

- 11కేవీ ఉప్పల్ హిల్స్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీర్జాదిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి 5.00 గంటల వరకు, 11కేవీ గణేష్‌నగర్ ఫీడర్ పరిధిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనుల మరమ్మతుల కారణంగా 33/11 చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో ద్వారా పేర్కొన్నారు.
- 11కేవీ మైవిల్లాస్ ఫీడర్ పరిదిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 33/11కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి 5.00 గంటల వరకు కరెంటు నిలిపివేయబడుతుంది.

కుషాయిగూడ: సాకేత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.